క్లుప్తంగా

వ్యాసరచన పోటీలు

ఆదిలాబాద్: 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా జిల్లా గ్రంథాలయంలో ఆదివారం విద్యార్థులకు అబ్దుల్ కలాం జీవిత చరిత్ర అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన వారికి గ్రంథాలయ ముగింపు వేడుకల్లో, ఈనెల 20న బహుమతులు ప్రదానం చేయడం జరుగుతుందని లైబ్రేరియన్ శ్రీనివాస్ తెలిపారు.

'వరి కొయ్యలను తగలబెట్టొద్దు'

ఆదిలాబాద్‌టౌన్: వరి కోతల తర్వాత కొయ్యలను తగలబెట్టవద్దని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి శ్రీధర్ స్వామి ఒక ప్రకటనలో తెలిపారు. ఇలా చేయడం ద్వారా వాతావరణ కాలుష్యంతో పాటు ఊపిరితిత్తుల్లో వాయుసంబంధ వ్యాధులు వచ్చే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. నెలలో సారం దెబ్బ తినడమే కాకుండా సూక్ష్మజీవులు సైతం దెబ్బ తిని జీవవైవిధ్యంపై ప్రభావం చూపుతుందని తెలిపారు. పంట తీత తర్వాత వరి కొయ్యలను కలియ దున్నడం ద్వారా నెలలో సారం పెరుగుతుందని సూచించారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ పట్టణంలోని ప్రభుత్వ సైన్స్ డిగ్రీ కళాశాలలో పీజీ అడ్మిషన్ల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ జగ్‌రాం అంతర్వేది, పీజీ సమన్వయకర్త కె.రాజ్‌కుమార్‌లు ఒక ప్రకటనలో తెలిపారు. ఎంఎస్సీ బాటనీలో 24 సీట్లు, ఎంఎస్సీ జువాలజీలో 1 సీటు అందుబాటులో ఉన్నట్లు పేర్కొన్నారు. అభ్యర్థులు సీపీజీఈటీ పరీక్షలో ఉత్తీర్ణులై ఉండాలని, డిగ్రీ పాసైన వారు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. స్పాట్ అడ్మిషన్‌లో సీటు లభించినవారికి ఫీజు రీయింబర్స్‌మెంట్ రాదని, ప్రాసెసింగ్ ఫీజు రూ.2100, ట్యూషన్ ఫీజు రూ.35800 చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఈనెల 20 వరకు గడువు ఉందని, కళాశాలలో సంప్రదించాలని పేర్కొన్నారు.

టోల్‌ప్లాజా కార్మికుడికి ఆర్థిక సాయం

నేరడిగొండ: టోల్‌ప్లాజా కార్మికుడు జాదవ్ కైలాష్ తండ్రి జాదవ్ రాందాస్ ఆదివారం మృతి చెందాగా.. రోల్‌మామడ టోల్‌ప్లాజా ఎంప్లాయీస్ సీఐ టీయూ నేరడిగొండ తరఫున రూ.41వేల ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నేరడిగొండ టోల్‌ప్లాజా అధ్యక్షుడు నక్క లక్ష్మణ్, సహాయ కార్యదర్శి గజ్జెల సురేందర్, మహేశ్, ధన్‌రాజ్, నరేందర్, తదితరులు పాల్గొన్నారు.

కార్యవర్గం ఎన్నిక

బోథ్: ధర్మ సమాజ్ పార్టీ మండల కార్యవర్గాన్ని జిల్లా అధ్యక్షుడు గణేష్ ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా గణేష్, ఉపాధ్యక్షుడిగా పెందూరు జల్దేవ్, నామోడే గజానంద్, కలిగేటి ప్రవీణ్, కుందూరు సుధాకర్, బిక్క రమేశ్, కార్యదర్శిగా రాథోడ్ నరేందర్, సభ్యులు బిక్క రాకేశ్, జూకంటి ప్రవీణ్ కుమారలను ఎన్నుకున్నారు.

'బీజేపీదే విజయం'


మాట్లాడుతున్న బ్రహ్మానందం

బోథ్: రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ విజయం సాధిస్తుందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు పతంగే బ్రహ్మానందం అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లాలో వంద శాతం సభ్యత్వ నమోదు పూర్తి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో అసెంబ్లీ కన్వీనర్ కదం బాబురావు, మండల కన్వీనర్ రవీందర్, తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో బీఎస్ఎన్ఎల్ జేఈ మృతి

ఆదిలాబాద్‌టౌన్: బీఎస్ఎన్‌లో జూనియర్ ఇంజనీర్ (జేఈ)గా పనిచేస్తున్న నర్సిములు(34) ఆదివారం అనారోగ్యంతో మృతి చెందారు. శనివారం రాత్రి బోధన్‌లో ఉన్న తన భార్యతో ఫోన్‌లో మాట్లాడారు. ఆదిలాబాద్ పట్టణంలోని బృందావనం కాలనీలో ఉండే తన బావమరిది ఫోన్ చేయగా, ఫోన్ లిఫ్ట్ చేయకపోవడంతో ఆయన ఇంటికి వచ్చాడు. తలుపులు నెట్టగా తీయకపోవడంతో పగలగొట్టి లోనికి వెళ్లగా బెడ్‌పై అపస్మారక స్థితిలో మృతి చెంది ఉన్నాడు. ఈయన గత కొంత కాలంగా బీపీతో బాధపడుతున్నాడు.

'అభివృద్ధి ఓర్వలేకనే విమర్శలు'

ఖానాపూర్: అధికారంలోకి వచ్చిన అనతికాలంలో చేపట్టిన అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను చూసి ఓర్వలేకనే కేంద్రమంత్రి కిషన్ రెడ్డి విమర్శలు చేస్తున్నారని కాంగ్రెస్ పార్టీ ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు బానావత్ గోవింద్ అన్నారు. ఆదివారం పట్టణంలో మాట్లాడారు. మూసీ ప్రాంత పర్యవేక్షణలో పాల్గొన్న మంత్రి వారి సూచనలు చేయాలే తప్ప అడ్డుకుంటామనడం సరికాదన్నారు.

శిథిల భవనాలు..!


నిరుపయోగంగా సబ్‌సెంటర్ భవనం

- ప్రారంభించక ముందే శిథిలావస్థకు..
- నీరుగారుతున్న ప్రభుత్వ లక్ష్యం
- రూ. లక్షల నిధులు వృథా

ఇచ్చోడ: మండలంలో పలు ప్రభుత్వ భవనాలు ప్రారంభించముందే శిథిలావస్థలోకి చేరుకుంటున్నాయి. దీంతో ప్రభుత్వ లక్ష్యం నీరుగారిపోతుంది. లక్షలాది రూపాయలు వెచ్చించి నిర్మించిన భవనాలు ప్రజల అవసరాలు తీర్చాకుండానే వృథాగా మారుతున్నాయి. అధికారులు ముందు చూపు లేకపోవడంతో నిర్మించిన భవనాలు వినియోగంలోకి రావడం లేదు.

నిరుపయోగంగా సబ్‌సెంటర్..

మండల కేంద్రంలోని పాత ఎస్సీకాలనీలో గత సంవత్సరం క్రితం రూ. 8 లక్షలతో సబ్‌సెంటర్ భవనం నిర్మించారు. నిర్మించిన భవనానికి సంబంధిత శాఖకు అప్పచెప్పి ప్రారంభించి వినియోగంలోకి తీసుకురావాలి. గత సంవత్సరం కిందట నిర్మించిన భవనం నిరుపయోగంగా ఉండటంతో భవనానికి ఉన్న కిటికీలు, తలుపులు పూర్తిగా ధ్వంసం కావడంతో ప్రారంభానికి నోచుకోకుండానే శిథిలావస్థలోకి చేరిపోయింది.

షాదీఖానా..


మండల కేంద్రంలో జాతీయ రహదారికి ఆనుకొని ఉన్న షాదీఖానా శిథిలావస్థలోకి చేరింది. ముస్లిం, మైనార్టీల కోసం రూ. 15 లక్షలతో షాదీఖానా నిర్మించారు. కానీ భవనం ప్రారంభించి సంబంధిత వారికి అప్పచెప్పక పోవడంతో కొన్ని సంవత్సరాల నుంచి నిరుపయోగంగా మారి, పూర్తిగా శిథిలావస్థలోకి చేరింది.

ఎమ్మార్సీ భవనం..


మండల కేంద్రంలో భీమన్నగుట్టకు వెళ్లే దారిలో (ఎమ్మార్సీ) విద్యావనరుల కేంద్రం భవనం నిర్మించారు. గత కొన్ని రోజుల కిందట కార్యాలయం గుండా సేవలు అందించారు. కానీ ఊరికి దూరంగా ఉందన్న సాకుతో విద్యావనరుల కేంద్రాన్ని మండల కేంద్రంలోని ప్రైమరీ స్కూల్లోకి మార్చారు. అప్పటి నుంచి నిరుపయోంగా మారి, శిథిలావస్థలోకి చేరింది.

ఎమ్మార్సీ కార్యాలయం...

మండల కేంద్రంలో భీమన్నగుట్టకు వెళ్లే దారిలో (ఎమ్మార్సీ) విద్యావనరుల కేంద్రం భవనం నిర్మించారు. గత కొన్ని రోజుల కిందట కార్యాలయం గుండా సేవలు అందించారు. కానీ ఊరికి దూరంగా ఉందన్న సాకుతో విద్యావనరుల కేంద్రాన్ని మండల కేంద్రంలోని ప్రైమరీ స్కూల్లోకి మార్చారు. అప్పటి నుంచి నిరుపయోంగా మారి, శిథిలావస్థలోకి చేరింది.

ప్రారంభించకుంటనే వదిలేసిన స్టేడియం..

మండల కేంద్రంలో ఎల్లమ్మకుంట వద్ద క్రీడా అభివృద్ధి కోసం స్టేడియం నిర్మించారు. దాదాపుగా రూ. 20 లక్షలతో భవనాలు నిర్మించారు. నిర్మించిన స్టేడియంను ప్రారంభించకుండానే వదిలేశారు. గత కొన్నేళ్ల నుంచి నిరుపయోగంగా మారినా.. స్టేడియం సాంఘిక కార్యాకలపాలకు అడ్డగా మారింది. పూర్తిగా శిథిలావస్థలోకి చేరింది.

నిధులు మంజూరు చేయాలి


నిరుపయోగంగా మారిన షాదీఖానా పునర్ నిర్మాణానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేయాలి, నూతన భవనం నిర్మించి ప్రజలకు ఉపయోగపడే విధంగా చర్యలు తీసుకోవాలి.

– అబ్దుల్ రషీద్, ఇచ్చోడ

ఉపయోగంలోకి తీసుకురావాలి


నిరుపయోగంగా మారిన భవనాలను ఉపయోగంలోకి తీసుకొని వచ్చే విధంగా అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలి. ప్రజల అవసరాలకు అనుగుణంగా తీర్చిదిద్దాలి. ఈ విధంగా అధికారులు కార్యచరణ చేపట్టాలి.

– నర్వాదే భగవన్, ఇచ్చోడ

ప్రజాధనం వృథా


లక్షల రుపాయలు వెచ్చించి నిర్మించిన భవనాలు ప్రజ అవసరాలు తీర్చకుండానే నిరుపయోగంగా మారుతున్నాయి. దీంతో ప్రజాధనం వృథా అవుతోంది. ప్రజాధనం వృథా కాకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వం తీసుకోవాలి.

– పెరమండ్ల స్వామి, ఇచ్చోడ

వ్యవసాయ పనులకు కూలీల కొరత

- మహారాష్ట్ర ఎన్నికల ఎఫెక్ట్
- తగ్గిన వలస కూలీలు
- ఆందోళనలో రైతులు

ఆదిలాబాద్‌రూరల్: అన్నదాతకు ఏదో ఒక రూపంలో ఇబ్బందులు తప్పడం లేదు. మండలంలో ప్రతీ ఏడాది మాదిరిగానే ఈఏడాది కూడా పత్తి అధికంగానే సాగు చేశారు. మండలంలో 35 వేల ఎకరాలలో పత్తి సాగవుతుండగా.. సోయాబీన్, ఇతర పంటలు సుమారు 10 వేల ఎకరాల నుంచి 15వేల ఎకరాలలో సాగవుతుంది. ప్రస్తుతం పత్తి పంట కోతకు వచ్చింది. ఒకేసారి అందరి వ్యవసాయ పాలాల్లో పత్తి కోతకు రావడంతో కూలీలు సకాలంలో దొరకక రైతులు ఇబ్బంది పడుతున్నారు.

చేనులోనే పత్తి..

పత్తి ఏరేందుకు కూలీలు సకాలంలో దొరకకపోవడంతో వారి కుటుంబ సభ్యులందరూ వ్యవసాయ పొలాలకు ఉదయమే వెళ్లి పత్తిని ఏరుతున్నారు. ఇదిలా ఉండగా.. కూలీల కొరత కారణంగా వ్యవసాయ పొలాల్లో పత్తి ఎండుతుంది. సకాలంలో పత్తిని ఏరకపోవడంతో ఎండకు పత్తి బరువు తగ్గుతుందని రైతన్నలు వాపోతున్నారు.

మహారాష్ట్రలో ఎన్నికలు..

ప్రతీ ఏడాది ఆదిలాబాద్‌కు అనుకొని ఉన్న మహారాష్ట్ర నుంచి కూలీలు వందల సంఖ్యలో వలస వస్తుంటారు. ఈ ఏడాది ఆ ప్రాంతంలో ఎన్నికలు ఉండడంతో వలస కూలీలు తగ్గారని పలువురు కూలీలు పేర్కొంటున్నారు. ఇదిలా ఉండగా కొంత మంది రైతులు ముందుగానే పత్తి పంటను తీసి రబీలో శనగ, ఇతర పంటలు సాగు చేస్తుంటారు. కూలీలు సకాలంలో లభించకపోవడంతో రబీ సాగు కాలాన్ని కొంత వాయిదా వేసుకుంటామని పేర్కొంటున్నారు. పత్తి తీసేందుకు కూలీలు సకాలంలో దొరకక పత్తిని విక్రయించేందుకు మార్కెట్‌కు తీసుకెళ్లలేకపోతున్నారు. వ్యవసాయ పొలంలోనే పత్తి ఉండడంతో ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


రామాయి శివారులో ఏరేందుకు సిద్ధంగా ఉన్న పత్తి

కాంగ్రెస్‌తోనే మహారాష్ట్ర అభివృద్ధి

- ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు

ఉట్నూర్‌రూరల్: మహారాష్ట్ర అభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యమని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. ఆదివారం యావత్‌మాల్ జిల్లా అర్ని నియోజకవర్గంలో ఏఐసీసీ జాతీయ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ ఆదేశాల మేరకు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు బీజేపీ నాయకులు ఎమ్మెల్యే సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. మాజీ మంత్రి జితేందర్ శివాజీ రావ్ మోగేకు హస్తం గుర్తుకు ఓటేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఆయన వెంట మాజీ మంత్రి జితేందర్ శివాజీరావ్ మోగే, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

కై లాస్‌నగర్: మహారాష్ట్ర అభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యమని ఆ పార్టీ ఆదిలాబాద్ పార్లమెంట్ ఇన్‌చార్జి ఆత్రం సుగుణ, కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్ రెడ్డి అన్నారు. మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం యావత్మాల్ జిల్లా అర్ని నియోజకవర్గంలో ఎమ్మెల్యే అభ్యర్థి జితేందర్ శివాజీ రావు మోగేకు మద్దతుగా ప్రచారం చేశారు. ఇంటింటికీ వెళ్లి ఓటర్లను పలుకరిస్తూ.. చేయి గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బీజేపీ కూటమీ నాయకుల మోసపూరిత వాగ్దానాలు నమ్మవద్దన్నారు. తెలంగాణలో ఆరు గ్యారంటీ పథకాలను అమలు చేస్తుందని, ఇక్కడ కూడా కాంగ్రెస్ కూటమి అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ప్రచారంలో సునీల్ జాదవ్, నారాయణ షిండే, గాటంజి బ్లాక్ ప్రెసిడెంట్ సహాదేవ్ రాథోడ్, మాజీ సర్పంచ్ గొట్టి ప్రమోద్, కరుణాకర్ పాల్గొన్నారు.


కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే

గోపాలకృష్ణ మఠంలో ఎంఈవో పూజలు


ఆదిలాబాద్: జిల్లా కేంద్రంలోని శ్రీరామచంద్ర గోపాలకృష్ణ మఠంలో ఆదిలాబాద్ ఎంఈవో సోమయ్య ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎంతో ప్రాచీన చరిత్ర గల గోపాలకృష్ణ మఠంలో ఆర్థిక మాస ఉత్సవాలు వైభవంగా సాగుతాయన్నారు. ప్రతీరోజు నిర్వహించే కాకడ హారతిలో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొంటారని తెలిపారు. ఆయన వెంట సనాతన హిందూ సభ సమితి అధ్యక్షుడు ప్రమోద్ కుమార్ ఖత్రి, తదితరులు ఉన్నారు.

ధ్యాన మందిర వార్షికోత్సవం

బేల: మండలంలోని సోన్‌కాస్ గ్రామంలో ఆదివారం ఆధ్యాత్మిక గురువు పూలాజీ బాబా ధ్యాన మందిరం 25వ వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. భజన కీర్తనలతో స్థానిక ప్రధాన వీధుల గుండా పూలాజీబాబా చిత్రపటంతో పల్లకి ఊరేగించారు. అనంతరం రక్తదాన శిబిరంలో మహిళలు, యువతీ, యువకులు రక్తదానం చేశారు. కార్యక్రమంలో శ్రీ సిద్దేశ్వర్ సంస్థాన్ పట్నాపూర్ అధ్యక్షుడు కేశవ్ ఇంగులే, స్థానిక ధ్యాన కేంద్రం అధ్యక్షుడు గుర్నులే సతీష్, వామన్ ఇంగులే, దీపక్ షిండే, నందకిశోర్ పాల్గొన్నారు.

ఆలయ వార్షికోత్సవం

తాంసి: మండలంలోని అంబుగాం గ్రామంలోని హనుమాన్ ఆలయ 3వ వార్షికోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. వేదపండితులు గంగాధర్ ఆధ్వర్యంలో నవగ్రహ పూజ, హోమం నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ యశ్వంత్, గ్రామపెద్దలు భారత్, పోచ్చిరాం, శేఖర్ పటేల్, భక్తులు పాల్గొన్నారు.


శోభాయాత్ర నిర్వహిస్తున్న భక్తులు

స్ఫూర్తి ప్ర'దాత'ల ఉదారత

- అర్బన్ రెసిడెన్షియల్ విద్యార్థులకు చేయూత
- తమకు తోచిన సాయం అందజేస్తున్న సేవకులు

ఆదిలాబాద్‌టౌన్: నేటి బాలలే రేపటి పౌరులు.. బాల్య జీవితమే భవిష్యత్‌ను నిర్దేశిస్తుంది. వికసిత బాల్యమే వారి సర్వతోముఖాభివృద్ధికి బాటలు వేస్తుంది. చదువుతో ముడిపడిన బాల్య దశ ఒడిదొడుకులు లేకుండా సాఫీగా సాగితేనే మంచి పౌరులుగా ఎదుగుతారు. ప్రార్థించే పెదవుల కంటే సాయం చేసే చేతులే గొప్పవనే భావనను ఆచరణ సాధ్యం చేస్తూ బాలలకు తమవంతు చేయూతనిస్తూ మానవతవాదులు బాల బాంధవులుగా స్ఫూర్తిగా నిలుస్తున్నారు. డ్రాప్ అవుట్, అనాథ నిరుపేద బాలురకు ఆశ్రయమిస్తూ వారి సమగ్ర వికాసానికి తోడ్పడుతున్న అర్బన్ రెసిడెన్షియల్ పాఠశాల విద్యార్థులకు కొందరు దాతలు తమవంతు సాయం అందజేస్తూ.. వారి విద్యాభివృద్ధిలో భాగస్వాములవుతున్నారు.

తోచిన సాయం చేస్తూ..

విద్యార్థులకు మంచి విద్యను అందించి వారి బంగారు భవిష్యత్‌కు దాతలు బాటలు వేస్తున్నారు. గుడిహత్నూర్‌కు చెందిన ఫిరోజ్, నౌషద్ తరానీ సోదరులు రూ. 50 వేల విలువ చేసే ట్రాక్ సూట్లను విద్యార్థులకు అందించారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించేందుకు రూ.35 వేల విలువైన కంప్యూటర్, ప్రింటర్‌తో పాటు క్రీడా పరికరాలను కూడా పాఠశాలకు విరాళంగా అందజేశారు. వరల్డ్ ఫాస్ట్ కొరియర్ యజమాని పనకంటి మహేశ్ పిల్లల మానసిక ఉల్లాసం కోసం రూ.25 వేలు విలువ చేసే టీవీతో పాటు విద్యార్థులకు గుర్తింపు కార్డులను ఉచితంగా అందజేశారు. తన కుమారుడి పుట్టినరోజు సందర్భంగా గతంలో ఆదిలాబాద్ జేసీగా పనిచేసిన సంధ్యారాణి స్వెటర్లను అందించి ఉదారతను చాటారు. యాద శంకర మెమోరియల్ ట్రస్ట్ వారు పోర్టబుల్ స్పీకర్, రగ్గులు పంపిణీ చేశారు.


సామగ్రి అందజేస్తున్న దాతలు (ఫైల్)

అలాగే కానిస్టేబుల్ ప్రతాప్ రెండు టేబుల్ ఫ్యాన్లు, వైద్యులు వినోద్ కుమార్ ఒక సీలింగ్ ఫ్యాన్‌ను అందజేసినట్లు పాఠశాల ప్రత్యేకాధికారి ప్రశాంత్ రెడ్డి తెలిపారు. అదేవిధంగా ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ కోవ విఠల్ దంపతులు ఆరు కుర్చీలతో పాటు దీపావళి పండుగ సందర్భంగా టపాసులు అందజేశారు. రైల్వే సీఐ పాశ్వాన్ తరచుగా పాఠశాలను సందర్శిస్తూ విద్యార్థులకు పండ్లు, స్నాక్స్, స్వీట్లు అందజేస్తున్నారు. సామాజిక స్పృహ ఉన్న కొందరు తల్లిదండ్రులు తమ పిల్లల పుట్టిన రోజు వేడుకలను ఈ పాఠశాల విద్యార్థుల మధ్యలోనే జరుపుకుంటున్నారు. తమకు తోచిన విధంగా నోటు పుస్తకాలు, పెన్నులు, బ్యాగులను విద్యార్థులకు అందజేస్తున్నారు.

అండగా నిలుస్తున్నారు


దాతలు విద్యార్థులతో మమేకం కావడంతో వారిలో సేవ దృక్పథం అలవడుతోంది. భవిష్యత్‌లో సమాజ సేవకులుగా ఎంతో మందికి మార్గదర్శకులుగా నిలుస్తారు. విద్యార్థుల స్థితిగతులను వివరిస్తూ తమవంతు సాయం చేయాలని దాతలను కోరుతున్నాం. ప్రభుత్వమే అన్ని ఇవ్వలేదు. సేవా భావం ఉన్న వ్యక్తులు మాకు అండగా నిలుస్తున్నారు.

– కె.ప్రశాంత్ రెడ్డి, యూఆర్ఎస్, ప్రత్యేకాధికారి

'కక్ష సాధింపు చర్యలు సరికాదు'


నిరసన తెలుపుతున్న లంబాడా నాయకులు

నార్నూర్: వికారాబాద్ జిల్లా కొడంగల్ నియోజకవర్గంలోని రుద్రాల మండలం లంబాడా తండాలైన లగేచర్ల గిరిజన రైతులను వేధించడం, అరెస్టు చేయడం, జైలుకు తరలించడం, మహిళలపై దౌర్జన్యం చేయడాన్ని ఖండిస్తూ ఆదివారం మండల కేంద్రంలోని గాంధీ చౌక్ వద్ద లంబాడా గిరిజనులు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఫ్యాక్స్ చైర్మన్ ఆడే సురేశ్ మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి తన సొంత అల్లుడి ఫార్మాసిటీ కోసం లంబాడాలను వేధించడం మానుకోవాలన్నారు. అక్రమ అరెస్టులతో జైల్లో పెట్టిన గిరిజనులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ రాథోడ్ రమేశ్, నాయకులు శివాజీ, రాథోడ్ అశోక్, మహేందర్, తదితరులు పాల్గొన్నారు.

ఉట్నూర్‌రూరల్: కొడంగల్ నియోజకవర్గంలోని లగేచర్ల గ్రామ గిరిజన లంబాడా రైతులను వేధించడం, అరెస్టు చేయడం, జైలుకు తరలించడం, మహిళలపై దౌర్జన్యం చేయడం సరికాదని లంబాడి గిరిజన సంఘాల నాయకులు అన్నారు. ఆదివారం ఉట్నూర్ ఐబీ చౌరస్తాలో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. జెడ్పీ మాజీ చైర్మన్ జనార్దన్ రాథోడ్, లంబాడా హక్కుల పోరాట సమితి రాష్ట్ర కార్య నిర్వాహక అధ్యక్షుడు భరత్ చౌహాన్‌లు మాట్లాడుతూ.. లంబాడా గిరిజనులను వేధించడం మానుకోవాలని, ఫార్మాసిటీ ఏర్పాట్లు రద్దు చేసుకోవాలన్నారు. జైల్లో పెట్టిన గిరిజనులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో లంబాడా జేఏసీ, గిరిజన సంఘాల నాయకులు బానోత్‌జగన్, రామారావు, నారాయణ, గుగ్లావత్ శ్రీరాంనాయక్, నేతావత్ రాందాస్, గణేశ్, రవి, గంగారాం పాల్గొన్నారు.


ఉట్నూర్ ఐబీ చౌరస్తాలో..

మాలమహానాడు సభను జయప్రదం చేయాలి

ఖానాపూర్: హైదరాబాద్‌లోని పరేడ్‌గ్రౌండ్‌లో డిసెంబర్ 1న నిర్వహించే మాల మహానాడు బహిరంగ సభను జయప్రదం చేయాలని ఆ సంఘం నాయకులు కోరారు. ఆదివారం పట్టణంలోని ఇంద్రనగర్‌లో సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జెండాను సంఘం సీనియర్ నాయకులు రాచమల్ల రాజశేఖర్ ఆవిష్కరించారు. మాలలు ఐక్యమత్యంతో ఉండి.. వ్యతిరేక విధానాలను మాలల తిప్పికొట్టాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు దాసరి రాజన్న, నేత శ్యామ్, ద్యావతి రాజేశ్వర్, పండుగ పెద్దులు, మ్యాదరి రాజేశ్వర్, సతీశ్, గంగాధర్, గంగేశ్వర్, శ్రీహరి, విక్రమ్, శేఖర్, అభిషేక్, సుమన్, సత్తయ్య, దాము తదితరులు పాల్గొన్నారు.

పచ్చని కళాశాల

తాంసి మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల పచ్చనిచెట్లతో ఆకట్టుకుంటుంది. కళాశాల భవనం చుట్టూ ఏపుగా పెరిగిన చెట్లు ఆహ్లాదాన్ని పంచుతున్నాయి. ఐదేళ్ల క్రితం కళాశాల ప్రిన్సిపాల్ సుదర్శన్, కళాశాల ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ సంతోశ్ హరితహారం కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటారు. ఆ మొక్కలు ఏపుగా పెరిగి కళాశాల ఆవరణ పచ్చగా కనిపిస్తోంది. – తాంసి



రైతులు సద్వినియోగం చేసుకోవాలి

నేరడిగొండ: రాష్ట్ర ప్రభుత్వం పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో పశువులకు వేసే ఉచిత గాలికుంటు నివారణ టీకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని పశువైద్యాధికారి రాథోడ్ జీవన్ అన్నారు. ఆదివారం మండలంలోని ధన్నూర్(డి), ఇశ్రుగూడ గ్రామాల్లో ఉచిత గాలికుంటు నివారణ టీకాల శిబిరాలను ఏర్పాటు చేసి, పశువులకు టీకాలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు వ్యవసాయంతో పాటు పశు పోషణపై దృష్టి సారించాలన్నారు. పశువులకు సోకే వ్యాధుల పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.


టీకా వేస్తున్న పశువైద్యాధికారి రాథోడ్ జీవన్